క్లుప్తంగా

కేసీ కి 159 క్యూసెక్కుల నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు బుధవారం అధికారులు తెలిపారు. డ్యామ్‌లో 0.634 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కోలుకోలేక కౌలు రైతు మృతి

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి గ్రామానికి చెందిన కౌలు రైతు దూదేకుల పెద్ద గోకారి (60) ఈనెల 2న పురుగుమందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. దూదేకుల పెద్ద గోకారి కొన్నేళ్లుగా గ్రామంలో కుమారులతో కలిసి 30 ఎకరాల దాకా పొలాన్ని కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాడు. పెట్టుబడులు అధికం కావడంతో అప్పులు పెరిగిపోయాయి. అప్పులు ఎలా తీర్చాలో దిగాలు పడి మనస్థాపానికి గురై ఈనెల 2న వేల్పనూరు రస్తాలోని దెంతల చేనులో పురుగు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి భార్య పుల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. గోకారికి ముగ్గురు కుమారులు సంతానం. రైతు కుటుంబాన్ని జిల్లా యూత్ వింగ్ సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు.

పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎస్పీ



బ్రాహ్మణదొడ్డి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కర్నూలు డీఎస్పీ విజయశేఖర్

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్, బ్రాహ్మణదొడ్డి గ్రామాల్లో బుధవారం కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ పర్యటించారు. పోలకల్‌లో రెగ్యులర్, స్పెషల్, మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అదేవిధంగా బ్రాహ్మణదొడ్డి ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన డీఎస్పీ వసతుల కల్పనపై ఆరా తీశారు. గ్రామ పరిస్థితులు, పోలింగ్ కేంద్రాల వివరాలను సర్పంచ్ దస్తగిరిని అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ వెంట ఎస్‌ఐ మన్మథ్‌విజయ్, సిబ్బంది ఉన్నారు.

పథకాలపై చెంచులకు అవగాహన

పాణ్యం : మండల కేంద్రమైన పాణ్యంలోని చెంచుకాలనీలో ప్రధానమంత్రి జన్ సమ్మాన్ పథకంపై గ్రామసభ జరిగింది. తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్ చెంచుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. సర్పంచ్ మేకల పల్లవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలు సమస్యలు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తహసీల్దార్ తెలిపారు. కాలనీవాసులకు 178 గృహాలు అవసరమని, 78 మందికి రేషన్‌కార్డులు, 47 మందికి నూతన ఆధార్‌కార్డులు, జన్‌ధన్ అకౌంట్ల కొరకు ప్రతిపాదించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దస్తగిరి, హౌసింగ్ ఏఈ అహ్మద్‌బాషా, ఈఓ బాలాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

20 లోపు పంట నమోదు చేసుకోవాలి

కల్లూరు: మండలంలోని రైతులు ఈ నెల 20లోపు రబీ పంటల ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని ఏఓ శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల లబ్ధి పొందాలంటే పంట నమోదుతో పాటు ఈకేవైసీ చేసుకోవాలన్నారు. రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో వీఏఏ/వీహెచ్‌ఏలను కలసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

హంద్రీనదికి నీరు విడుదల చేయాలి

కోడుమూరు రూరల్ : ఒట్టిపోయిన హంద్రీనదికి గాజులదిన్నె ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలని కోరుతూ బుధవారం సీపీఐ నాయకులు స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు క్రిష్ణ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల హంద్రీనది పూర్తిగా ఎండిపోవడంతో కోడుమూరులోని కాలనీలకు వారం రోజులకోసారి కుళాయిలకు నీళ్లను విడుదల చేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గాజులదిన్నె ప్రాజెక్టు నీటిని హంద్రీనదికి విడుదల చేసి పట్టణ ప్రజల నీటి కష్టాలను తీర్చాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి శేషు, సీపీఐ నాయకులు శివుడు, బజారి, శంకర్, చిన్న రాముడు పాల్గొన్నారు.

దుకాణాల తనిఖీ

కర్నూలు (న్యూటౌన్): నగరంలోని 30 వ్యాపార, వాణిజ్య దుకాణాలపై బుధవారం తనిఖీలు చేపట్టినట్లు తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పరమేశ్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ తూకాల్లో తేడాలొస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని పెయింట్‌షాపులో పెయింట్ బకెట్‌పై ఎంఆర్‌పీ, తయారీ తేదీ లేకపోవడంతో కేసు నమోదు చేశామన్నారు.

పొలానికి రస్తా.. రైతన్నకు తప్పిన అవస్థ

- ఎమ్మెల్యే కాటసాని చొరవతో పొలాల రస్తాల అభివృద్ధి
- నియోజకవర్గానికి మైనింగ్ ఫండ్స్ నిధులు రూ.4.01 కోట్లు మంజూరు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



గడివేములలో రోడ్డు వేయకముందు అధ్వానంగా పొలాల దారి



నేడు - రస్తాను బాగు చేసిన దృశ్యం

గడివేముల: గతంలో రస్తాలు బాగా లేకపోవడంతో రైతులు పొలాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడేవారు. వర్షాకాలం వచ్చిందంటే మరీ కష్టంగా ఉండేది. రాత్రి వేళల్లో పొలాల వద్దకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి. రైతుల కష్టాలను గుర్తించిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి జిల్లా మైనింగ్ ఫండ్స్ నుంచి నిధులు మంజూరు చేయించి పొలాల రస్తాను బాగు చేయించారు. దీంతో అవస్థలు తీరాయని రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పట్టించుకోని గత ప్రభుత్వాలు

మండల కేంద్రంలో ముఖ్యంగా పల్లెపాలెం, మూలమడ, తంగోడి రస్తా, పెద్ద మడ రస్తాలలో అధికంగా పొలాలు ఉన్నాయి. ఈ రోడ్లు అన్ని కలిపి దాదాపు ఆరు కిలోమీటర్లు ఉంటాయి. గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో అధ్వానంగా ఉన్న రోడ్లపై రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. పండించిన దిగుబడులను ఇంటికి తీసుకురావాలంటే అష్టకష్టాలు పడాల్సి వచ్చేది. తీసుకొచ్చే సమయంలో ప్రమాదాలు జరిగిన సంఘటనలూ ఉన్నాయి. ఇక వర్షం వచ్చిందంటే రైతుల కష్టాలు వర్ణణాతీతం.

రూ.25 లక్షలతో పొలాలకు రస్తా..

గడివేముల జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రోఖరరెడ్డి, రైతు నాయకులు రైతుల కష్టాలను పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన డిస్ట్రిక్ మైనింగ్ ఫండ్స్ నుంచి వెంటనే రూ.25 లక్షలు మంజూరు చేయించారు. దీంతో పోలాల రస్తాల బాగు చేశారు. రోడ్లు బాగు చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పాణ్యం నియోజవర్గానికి నిధులు..

పాణ్యం నియోజకవర్గానికి డిస్ట్రిక్ మైనింగ్ ఫండ్స్ కింద రూ.4.01 కోట్లలు మంజూరు చేసినట్లు పంచాయతీరాజ్ ఏఈ భాస్కర్ తెలిపారు. ఇందులో గడివేములకు రూ.90 లక్షలు, పాణ్యం రూ.90 లక్షలు, కల్లూరు రూ.125 లక్షలు, ఓర్వకల్లు రూ.96 లక్షలు కేటాయించి, పనులు పూర్తి చేశారు.

ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదు



రైతుల పొలాల రస్తాలు బాగు చేయడానికి గత ప్రభుత్వం పట్టించుకోలేదు. పొలంలో పండించిన పంటలను ఇంటికి తీసుకురావాలంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లం. పల్లెపాలెంలో దాదాపు వెయ్యి మంది రైతులు దాకా ఉంటాం. రోడ్డు బాగు చేయడంతో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– వంగాల మహేశ్వరరెడ్డి, ఎంపీటీసీ, గడివేముల

రోడ్డు బాగా వేశారు



నేను గత 20 ఏళ్ల నుంచి పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. రోడ్డు సరిగా లేకపోడవంతో పొలానికి కూలీలు రావాలంటే ఇబ్బందులు పడేవారు. కొందరు వచ్చేందుకు విముఖత చూపేవారు. గుంతల మయంగా ఉన్న పొలాల రస్తాలను బాగు చేయడంతో రైతులు ఏ సమయంలోనైనా పొలానికి వెళ్లవచ్చు.

– దాసరి రాముడు, రైతు, గడివేముల

రోడ్డు వేస్తారనుకోలేదు



నేను 18 ఏళ్ల నుంచి వ్యవసాయం చేస్తున్నాను. నా పొలం తంగోడి రస్తాలో ఉంది. గతంలో పొలానికి వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడేవారం. నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఎమ్మెల్యే సహకారంతో రోడ్డు వేయడంతో బైకులో వెళ్తున్నాను. పొలాల రస్తా వేయడంతో ఎంతో ఆనందంగా ఉంది. – మహమ్మద్‌రఫీ, రైతు

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం సురక్షితం

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం సురక్షితం అని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం ఆయన భూపాల్‌నగర్‌లో జరుగు తున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ గర్భిణులు, ఐదేళ్లలోపు చిన్నారులకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పక ఇవ్వాలని తెలిపారు. ఏఎన్‌ఎంలు, ఆశాలు వారి పరిధిలో ని టీకాలు వేయబోవు పిల్లలు, గర్భిణులు వారి అందరినీ సెంటర్ వద్దకు పిలిపించి వారికి టీ కాలు వేయాలన్నారు. ఆ వివరాలను ఆర్‌సీహెచ్, యూవీన్, హెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పు అయ్యేటట్లు అవగాహన కల్పించాలన్నారు. 3వ నెలలోనే గర్భిణులను గుర్తించి వారిని ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించి వారికి అన్ని సేవలు అందించాలన్నారు. అనంతరం ఆయ న గర్భిణీలకు ఐరన్ మాత్రలు, బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలకు ఐఎఫ్‌ఏ, విటమిన్‌–ఎ సిరప్‌లను పంపిణీ చేశారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు నోటీసులు జారీ

కర్నూలు(సెంట్రల్): సర్వ శిక్షాఅభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరితే తొలగించేందుకు నోటీసులు ఇవ్వడం అన్యాయమని ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఎ.నాగేశ్వరరావు పేర్కొన్నారు. పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరితే తప్పా అని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సత్యమ్మ, రామయ్య, సోమేశ్వరి, కృష్ణవేణి, యశోద, రాజరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అడుగుజాడలలో నడవాలి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

సి బెళగల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడలలో నడవాలని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని ఎంపీపీ బొంతల మునెప్ప అన్నారు. మండల కేంద్రం సి.బెళగల్‌లో బుధవారం జన్ భాగీదారి కార్యక్రమం ఈఓఆర్డీ సందీప్ ఆధ్వర్యంలో జరిగింది. జిల్లా మత్స్యశాఖ డీడీ, మండల ప్రత్యేకాధికారిణి శ్యామల, మండల అధికారులు, ప్రజా ప్రనిధులతో కలిసి ఎంపీపీ బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక న్యాయ మహాశిల్పం నమూనా చిత్ర పటాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాండురంగన్న, ఎంపీటీసీ సభ్యుడు వీరన్న గౌడ్, ఏపీఓ లక్ష్మన్న, నాయకులు బసయ్య తదితరులు పాల్గొన్నారు.

13న కవి సమ్మేళనం

కర్నూలు కల్చరల్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని తెలుగు సారస్వత వైభవం సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు గొర్రెడ్డి హరిశ్చంద్రారెడ్డి తెలిపారు. ఏపీ ప్రభుత్వ తెలుగు భాష సేవ పురస్కార గ్రహీతలు ఆకాశ వాణి విశ్రాంత వ్యాఖ్యాత డాక్టర్ వి.పోతన్న, ఉస్మానియా కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ మండి అన్వర్ హుసేన్, విశ్రాంత తెలుగు ఆచార్యులు డాక్టర్ ఆదవాని హనుమంతప్పలకు సన్మానం ఉంటుందని పేర్కొన్నారు.

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి స్పందన



గూడూరు లో జరిగిన శిబిరంలో రోగులను పరిశీలిస్తున్న దృశ్యం

గూడూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన వచ్చింది. పట్టణంలో బుధవారం హరిజనవాడలో రెండవ విడత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ప్రజలకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. హెల్త్ క్యాంప్‌ను మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, కమిషనర్ ప్రసాద్‌గౌడ్ సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. 371 మందికి వైద్య సేవలు అందజేసినట్లు డాక్టర్ ప్రత్యూష తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సురేష్, హెల్త్ కో ఆర్డినేటర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేయండి

కర్నూలు సిటీ: గ్రామీణ ప్రాంతాల్లో పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ సూచించారు. బుధవారం కర్నూలు మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు మండల పరిధిలోని గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. అనంతరం సభ్యులు తమ పరిధిలోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో ఎంపీడీఓ అజాంఖాన్, జడ్పీటీసీ ప్రసన్నకుమార్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో ముఖ్యాంశాలు

- కర్నూలు రూరల్ మండల పరిధిలో ఈ రబీలో జొన్న, శనగ, పొగాకు, ఉల్లి, మొక్కజొన్న, మినుములు సాధారణ సాగు 6,546 హెక్టర్లకుగాను, 3616 హెక్టార్లలో సాగు అయ్యాయని మండల అగ్రికల్చర్ అధికారి తెలిపారు. వైఎస్ఆర్ రైతు భరోసా కింద మొదటి విడతలో 10,238 పట్టాదారులకు రూ.2,04,76,000, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద 10,310 మంది రైతులకుగాను రూ.రూ.6,18,60,000 మంజూరు అయ్యాయని తెలిపారు.
- గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ పరిధిలో మండలంలో ఎంపీ ల్యాండ్స్‌తో రూ.2.44 కోట్లతోను, 19 గ్రామాల్లో శానిటరీ కాంప్లెక్స్‌లకు రూ.71 లక్షలు, పీఎం ఆవాస్ యోజన, వైఎస్ఆర్ జగనన్న 14 కాలనీల్లో రూ.2.11 కోట్లు, జల్‌జీవన్ మిషన్ కింద రూ.2.16 కోట్లతోను, రూ.37.50 లక్షల సీఎండీఎఫ్ నిధులతో తాగు నీటి సదుపాయలు, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.3 కోట్లతో డ్రైన్స్, కల్వర్ట్‌లను నిర్మిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వెల్లడించారు.
- 18 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన గ్రామ సచివాలయాల నిర్మాణ పనులు 7 పూర్తి కాగా, 6 ఫినిషింగ్ దశలోను, రెండు బెస్‌మెంట్ లెవెల్‌లోను, 9 శ్లాబ్ దశలో పనులు జరుగుతున్నట్లు, ఒకటి కోర్టులో కేసు ఉన్నట్లు పీఆర్ ఇంజినీర్ తెలిపారు.
- 10 ఆర్బీకే సెంటర్లు పూర్తికాగా, 4 ఫినిషింగ్ దశలో, 5 రూఫ్ లెవెల్‌లో, 5 బెస్‌మెంట్ లెవెల్‌లో పనులు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనాలు 8 పూర్తి కాగా, 2 ఫినిషింగ్ దశలో, 5 బెస్‌మెంట్ లెవెల్, రెండు రూఫ్ లెవెల్ పనులు జరుగుతున్నాయి.

22న అయోధ్య రామాలయ సంబరాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి సభ్యులు

కర్నూలు కల్చరల్: సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన కర్నూలులో అయోధ్య రామాలయ సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షులు డాక్టర్ మోక్షేశ్వరుడు, కె.క్రిష్టన్న పేర్కొన్నారు. బుధవారం సీక్యాంప్ టీ జీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంబరాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన అయోధ్యలో జరుగు శ్రీ బాలరాముల వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకొని కర్నూలులో సీతారాముల వారి శోభాయాత్ర, పట్టాభిషేక మహోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అయోధ్య రామాలయానికి కర్నూలుకు అవినాభావ సంబంధం ఉందన్నారు. అయోధ్య కేసును వాదించేందుకు అయ్యే వ్యయాన్ని జిల్లాకు చెందిన జి.పుల్లారెడ్డి సమకూర్చారన్నారు. అదే విధంగా కర్నూలు సంఘ్ కార్యకలాపాల్లో కీలకంగా ఉన్న వ్యక్తులు ప్రస్తుతం అయోధ్య రామ మందిర నిర్మాణంలో భాగస్వాములుగా ఉన్నారన్నారు. ఉదయం 10 గంటలకు ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో సీతారాముల వారి కల్యాణం, మధ్యాహ్నం 1 గంటకు అక్కడి నుంచే శ్రీరాముల వారి విగ్రహంతో శోభయాత్ర ప్రారంభమై నగరంలోని పురవీధుల గుండా ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు సాగుతుందన్నారు. ఎగ్జిబిషన్ మైదానంలో నమూనా అయోధ్య రామాలయం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి నాగోజిరావు, కార్యదర్శి నటేష్ కుమార్, ఉపాధ్యక్షులు మహాబలేష్, చల్లా దామోదర్‌రెడ్డి, కోశాధికారి కల్కి మురళి, సభ్యులు గోపీనాథ్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య పవిత్ర అక్షింతల వితరణ

అయోధ్య నుంచి వచ్చిన పవిత్ర అక్షింతలను బుధవారం రాగమయూరి గ్రీన్ ల్యాండ్‌లో పంపిణీ చేశారు కాలనీలోని పెద్దలందరూ జై శ్రీరాం జైజై శ్రీరాం అని నినాదాలు చేస్తూ స్థానిక హిందూ కుటుంబాలకు అక్షింతలు, అయోధ్య నమూనా చిత్రం, ఆహ్వాన పత్రం అందించారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ కర్నూలు జిల్లా కార్యదర్శి మాళిగి భానుప్రకాష్ మాట్లాడుతూ ఈనెల 22 వ తేదీన శ్రీరామ జన్మభూమి అయోధ్యలో జరిగే భగవాన్ రామ్ లల్లా విరాజ్‌మాన్ (బాలరాముడు) మహాప్రాణ ప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంలో ప్రతి ఇంటినీ సుందరంగా అలంకరించి పూజలు చేయాలన్నారు. ఆపస్ జిల్లా నాయకులు నాగిరెడ్డి, బీజేపీ నాయకులు మద్దిలేటి రెడ్డి పాల్గొన్నారు.

హోరాహోరీగా సాగిన ఆటల పోటీలు



సి.బెళగల్లో టాస్ వేసి కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ బొంతల మునెప్ప



సి.బెళగల్లో రసవత్తరంగా సాగుతున్న కబడ్డీ పోటీలు



గూడూరు: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ సునీత



బ్యాటింగ్ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి

సి.బెళగల్: ఆడుదాం ఆంధ్రా కీడా పోటీల్లో భాగంగా బుధవారం మండలస్థాయి ఆటల పోటీలు హోరాహోరీగా సాగాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను అధికారులతో కలిసి ఎంపీపీ బొంతల మునెప్ప, జిల్లా మత్స్యశాఖ డీడీ, మండల ప్రత్యేకాధికారిణి శ్యామల ప్రారంభించారు. క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని ఈ సందర్భంగా ఎంపీపీ క్రీడాకారులకు సూచించారు. ఐదు క్రీడాంశాలలో మొదటి రోజు కబడ్డీ పోటీలను నిర్వహించగా మండల వ్యాప్తంగా 14 జట్లకు ఆటలను వ్యాయామ ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్, సర్పంచ్ పాండురంగన్న, ఎంపీటీసీ సభ్యుడు వీరన్నగౌడ్, పీడీలు వెంకటేశ్వర్లు, సుంకారావు, చక్రపాణి, రమణ, హైమావతి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గూడూరు: క్రీడల్లో పాల్గొంటే ఒకరిపై ఒకరికి స్నేహ భావం పెంపొందుతుందని ఎంపీపీ సునీత అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ మైదానంలో బుధవారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి ఆటల పోటీలను ఎంపీపీ సునీత, మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. ఎంపీడీఓ రాముడు మాట్లాడుతూ మండల స్థాయిలో గెలుపొందిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, ఎంఈఓలు నాగరాజు, సుశీలమ్మ, పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలలో క్రీడాకారులు ప్రతిభను చాటుకోవాలని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కోడుమూరు బాలుర హైస్కూల్లో నిర్వహించిన మండల స్థాయి ఆటల పోటీలను సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డితో కలిసి జెడ్పీటీసీ ప్రారంభించారు. జెడ్పీటీసీ బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లోని నైపుణ్యాలను వెలికి తీసేందుకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర పోటీలను నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ నాయుడు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటరీలు పాల్గొన్నారు.

ఓర్వకల్లు : ఆడుదాం..ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నోడల్ ఆఫీసర్(ఎంపీడీఓ) శివనాగప్రసాద్ అధ్యక్షతన జరుగుతున్న పోటీలను కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు పద్మనాభరెడ్డి, శంకర్‌రెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఏఈ రామయ్య ఎంఈఓ ఓంకార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం : మండల కేంద్రమైన పాణ్యంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆడుదాం.. ఆంధ్ర క్రీడలు ప్రారంభమయ్యాయి. క్రీడలను ఎంపీపీ ఉసేన్‌బీ, ఎంపీడీఓ దస్తగిరి, తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్ ప్రారంభించారు. సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: స్థానిక జెడ్పీ హైస్కూల్ మైదానంలో మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలను బుధవారం సర్పంచ్ రవరణమ్మ, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప ప్రారంభించారు. ఉప సర్పంచ్ బాలచెన్ని, ఎంపీటీసీ వంగాల మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కల్లూరు: మండల స్థాయి ఆడుద్దాం ఆంధ్ర క్రీడాల్లో భాగంగా ఉలిందకొండ, పర్ల గ్రామాల్లో క్రికెట్ పోటీలను ఎంపీడీఓ రమణమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుంకులమ్మ, నాయకులు శేఖర్, శీన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



ఓర్వకల్లులో పోటీలను ప్రారంభిస్తున్న ప్రభాకర్‌రెడ్డి



కబడ్డీలో తలపడుతున్న మహిళలు



పాణ్యంలో క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ

పురాతన డప్పు కళను ఆదరించాలి



మాట్లాడుతున్న ఏపీ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌బాబు

కల్లూరు: భారత సమాజంలో అత్యంత పురాతన సంప్రదాయ కళగా ఉన్న డప్పు కళను ఆదరించి, డప్పు కళాకారుల సమస్యలను పరిష్కరిస్తే జజ్జనకర జనారే అంటూ ఉత్సాహ పరుస్తామని ఏపీ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ బాబు అన్నారు. బుధవారం కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో డప్పు పండుగ ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో కర్నూలు, కల్లూరు, ఓర్వకల్లు మండలాలకు చెందిన 40 టీములు డప్పులతో ఆకట్టుకునేల ప్రదర్శనలు చేశారు. కార్యక్రమానికి ఉత్సవాల కమిటీ ఉపాధ్యక్షుడు ఎస్.చక్రపాణి, ఆనంద్‌బాబు, తిరుమలేశ్వర రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ అనేక పండుగలు, సంబరాల సందర్భంగా వివిధ కళలకు పోటీలు నిర్వహిస్తున్న సమాజం, ఆదిమ కళగా ఉన్న డప్పును మాత్రం మరిచి పోయిందన్నారు. దళితులు వృత్తిగా ఎంచుకున్న కళగా నేటికీ వివక్షకు గురవుతూనే ఉందన్నారు. డప్పు ఔన్నత్యాన్ని సమాజం ముందు ఉంచడంతో పాటు, డప్పు కళాకారుల సమస్యలను పాలక వర్గాలు చర్చించే విధంగా చేయడంలో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఈ డప్పు పండుగ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మద్దిలేటి, కరుణాకర్, కృష్ణ, గురుస్వామి, భాస్కర్, బతకన్న, రమణ, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ‘గడప గడపకు మన ప్రభుత్వం’

ఓర్వకల్లు : మండలంలోని శకునాల గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ సర్పంచు రాధిక ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలన్నారు.